క్లుప్తంగా

భక్తిశ్రద్ధలతో వ్యాసపూర్ణిమ



ఉసిరి మొక్క నాటుతున్న సర్పంచ్ భార్గవ నాయుడు

భామిని: మండలంలోని పసుకుడి గ్రామంలో ప్రతిష్ఠించిన శ్రీకృష్ణ, చైతన్య మహాప్రభు విగ్రహాల వద్ద ఆదివారం వ్యాసపూర్ణిమను పురస్కరించుకుని భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. భజన బృందం సభ్యులు రోజంతా హరేరామ, హరేకృష్ణ సంకీర్తులు ఆలపించారు. సర్పంచ్ బి.భార్గవనాయుడు, పాలసొసైటీ చైర్మన్ బెవర ఆనందరావు ఆధ్వర్యంలో భక్తులు ఆలయం వద్ద ఉసిరి మొక్కను నాటి పూజలు చేశారు. పసుకుడి, చిన్నదిమిలిలో శివాలయం వద్ద అన్నసమారాధన నిర్వహించారు. నేరడి–బిలో వంశధారకు నదీహారతి సమర్పించారు.

ప్రారంభమైన తాడికొండ జాతర

గుమ్మలక్ష్మీపురం: మండలంలోని తాడికొండ గ్రామంలో అర్ధనారీశ్వర, మజ్జిగారిదేవి జాతర మహోత్సవాలు ఆదివారం నుంచి ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా అర్ధనారీశ్వర ఆలయంలో స్థానికులతో పాటు పరిసర గ్రామాలకు చెందిన భక్తులు ప్రత్యేక పూజలు చేసి మొక్కులు తీర్చుకున్నారు. ఏటా ఫిబ్రవరి నెలలో గ్రామంలో జాతర నిర్వహించడం తమ పూర్వీకుల నుంచి వస్తున్న ఆచారమని, ఈ నెల 7వ తేదీ వరకు జాతర మహోత్సవాలు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు అడ్డాకుల గంగరాజు, నరేష్, పకీరు, బాలరాజులు తెలిపారు.

వృద్ధులకు దుప్పట్ల పంపిణీ



వృద్ధులకు దుప్పట్లు పంపిణీ చేస్తున్న కృష్ణమూర్తి

కొమరాడ: పార్వతీపురం పోలీస్ స్టేషన్‌లో పని చేస్తున్న హెడ్ కానిస్టేబుల్, వృద్ధమిత్ర కోఆర్డినేటర్ కె.కృష్ణమూర్తి కొమరాడ మండలం మార్కొండపుట్టి గ్రామంలో పేదలకు దుప్పట్లు, స్టీల్ గ్లాసులు ఆదివారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మనకు ఉన్నదాన్లో కొంత పేదలకు సాయం చేయడం మనసుకు తృప్తినిస్తుందన్నారు. ప్రతి ఒక్కరూ సేవాభావం కలిగి ఉండాలని, తోటివారికి సాయం చేయాలని కోరారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ గొర్లి రవీంద్ర, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

ఘనంగా సూర్యనారాయణ స్వామి కల్యాణం



స్వామివారి కల్యాణంలో పాల్గొన్న భక్తులు

పాలకొండ: మాఘ పౌర్ణమి సందర్భంగా స్థానిక అభయాంజనేయస్వామి ఆలయ ప్రాంగణంలో ఉన్న సూర్యనారాయణ స్వామివారి కల్యాణాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకులు వేమకోటి హరీష్ శర్మ ఆధ్వర్యంలో భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం స్వామివారి కల్యాణాన్ని తిలకించి, పూజాక్షింతలు, తీర్థప్రసాదాలు స్వీకరించారు.

ఆంజనేయస్వామికి ప్రత్యేక పూజలు



ఆంజనేయస్వామికి పూజ చేస్తున్న అర్చకుడు

సాలూరు: పట్టణంలోని తపోవనంలో గల సంకట విమోచన పంచముఖ ఆంజనేయస్వామి ఆలయ సప్తమ వార్షికోత్సవం మాఘ ఆదివారం ఘనంగా నిర్వహించారు. సింధూర అర్చన, తమలపాకు పూజలు చేపట్టారు. కార్యక్రమంలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

సినీ ప్రముఖులకు నివాళులు

బలిజిపేట: ఇటీవల మృతిచెందిన సినీ ప్రముఖులకు పెదపెంకి గ్రామంలోని నేతాజీ గ్రంథాలయం వద్ద గ్రామస్తులు ఆదివారం నివాళులర్పించారు. గ్రంథాలయ వ్యవస్థాపకుడు సంజీవనాయుడు ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో కళాతపస్వి కె.విశ్వనాథ్, ప్రముఖ గాయని వాణీజయరామ్ మృతికి సంతాపం తెలిపి వారి చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో దాలినాయుడు, పైడిపునాయుడు, హర్షవర్ధన్ తదితరులు పాల్గొన్నారు.

ట్రాఫిక్ కష్టాలకు చెక్!

- ప్రారంభమైన రహదారి విస్తరణ పనులు
- ఆక్రమణల తొలగింపునకు మార్కింగ్ మరూ..



పెదమేరంగి జంక్షన్ వద్ద ఆక్రమణల తొలగింపు

కురుపాం: నియోజకవర్గ పరిధిలో తోటపల్లి నుంచి కురుపాం మండల కేంద్రం(గుణుపూరు) రోడ్డు వరకు రహదారి విస్తరణ పనులు చురుగ్గా సాగుతున్నాయి. సుమారు రూ.40.50 కోట్లతో రహదారి విస్తరణ, కల్వర్టులు, బెర్మల నిర్మాణ పనులు చేపడుతున్నారు. ఇందులో భాగంగా రోడ్డుకు ఇరువైపులా ఉన్న అక్రమ నిర్మాణాలను అధికారులు తొలగిస్తున్నారు. దశాబ్దాల కిందట రహదారిని ఆక్రమించి నిర్మాణాలు చేపట్టడంతో ఇరుకు రోడ్డులో రాకపోకలు సాగించేందుకు వాహనచోదకులు అవస్థలు పడాల్సి వస్తోంది. ఎదురెదురుగా వచ్చే వాహనాలు తప్పుకునేందుకు స్థలం లేకపోవడంతో ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడుతోంది. దీంతో రహదారి విస్తరణతో ట్రాఫిక్ సమస్యకు చెక్ పెట్టేందుకు ఆర్అండ్‌బీ అధికారులు చర్యలు చేపట్టారు. పార్వతీపురం డివిజన్ పరిధిలో జియ్యమ్మవలస మండలం పెద్దమేరంగి జంక్షన్ నుంచి సీమనాయుడువలస, జోగిరాజుపేట గ్రామం వరకు రహదారిపై ఉన్న ఆక్రమణలు తొలగించే చర్యలు చేపట్టారు. మరో రెండు వారాల్లో కురుపాం మండల కేంద్రంలోని ధూళికేశ్వరస్వామి ఆలయం నుంచి రావాడ రోడ్డు జంక్షన్ వరకు ఆక్రమణలను తొలగించేందుకు చర్యలు చేపడుతున్నట్లు కురుపాం డివిజన్ ఆర్అండ్‌బీ జేఈ నిర్మల తెలిపారు. మొదటిగా సర్వే చేపట్టి తరువాత ఆక్రమణలను తొలిగిస్తామన్నారు. రోడ్డు మధ్య నుంచి ఇరువైపులా ఎనిమిది మీటర్ల చొప్పున నిర్మాణాలను తొలగించే అవకాశం ఉన్నట్లు చెప్పారు. ఇప్పటికే మారింగ్ కూడా చేపట్టినట్లు చెప్పారు. రహదారి విస్తరణ పనులు పూర్తయితే ట్రాఫిక్ సమస్యకు పరిష్కారం లభిస్తుందని వాహన చోదకులు అంటున్నారు.



రోడ్డుపై నిలిచిపోయిన ఆర్టీసీ బస్సులు

శతశాతం పింఛన్ల పంపిణీ పూర్తి



బత్తిలిలో వృద్ధుడు జోగులు వివరాలను ఆర్‌బీఐఎస్ యాప్‌లో నమోదు చేస్తున్న వలంటీర్ హేమలత



గరుగుబిల్లి: రేగంనాయుడుకు పింఛన్ అందిస్తున్న వలంటీర్ సుధారాణి



నేరడి-బిలో వృద్ధురాలు ఆదమ్మ ఫొటో తీసుకుని పింఛన్ అందజేస్తున్న డబ్ల్యూఏ ఆర్.సుధారాణి

భామిని: మండలంలో ఆదివారం నాటికి శతశాతం పింఛన్ల పంపిణీ పూర్తయిందని అధికారులు తెలిపారు. బయోమెట్రిక్ డివైజ్‌లో వేలిముద్రలు నమోదు కానివారికి రియల్‌టైమ్ బెనిఫిసరీ ఐడెంటిఫికేషన్ సిస్టం(ఆర్‌బీఐఎస్) యాప్‌లో లబ్ధిదారుల వివరాలను వెల్ఫేర్ అసిస్టెంట్లు నమోదు చేసి పింఛన్లు అందజేశారు. మండలంలో మొత్తం 7,080 మంది పింఛను లబ్ధిదారులకు గాను రూ.1,94,57,000లు మంజూరైంది. ఇందులో శనివారం సాయంత్రానికి 6,963 మందికి పింఛన్ల పంపిణీ పూర్తయింది. వేలిముద్రలు పడక ఇబ్బంది పడుతున్న 117 మంది వృద్ధులకు సచివాలయ వెల్ఫేర్ అసిస్టెంట్లు ఆదివారం ఆర్‌బీఐఎస్ యాప్ ద్వారా పింఛన్లు అందజేశారు.

ఆస్పత్రికి వెళ్లి పింఛన్ అందజేత

గరుగుబిల్లి/భామిని: మండలంలోని నాగూరు గ్రామానికి చెందిన కేతిరెడ్డి రేగంనాయుడు అనారోగ్యంతో శ్రీకాకుళం జెమ్స్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. దీంతో వలంటీర్ ఎ.సుధారాణి ఆదివారం ఆస్పత్రికి వెళ్లి లబ్ధిదారుకు పింఛను డబ్బులు అందజేసింది. అలాగే భామిని మండలం దిమ్మిడిజోలకు చెందిన వృద్ధులు కేవటి ఆదినారాయణ, వసంత అనారోగ్యంతో శ్రీకాకుళంలోని మెడికవర్, కిమ్స్ ఆస్పత్రులలో చికిత్స పొందుతుండడంతో వలంటీర్లు కాగితాపల్లి వినోద్‌నాయుడు, ఎ.ధనలక్ష్మి ఆదివారం ఆస్పత్రికి వెళ్లి వారికి పింఛన్లు అందజేశారు. వ్యయప్రయాసలు ఓర్చి 80 కిలోమీటర్ల దూరంలోని ఆస్పత్రికి వచ్చి పింఛను అందజేయడంతో లబ్ధిదారులు చాలా సంతోషించారు.



వృద్ధురాలు వసంతకు పింఛన్ అందిస్తున్న వలంటీర్ ధనలక్ష్మి

పార్టీ కోసం సమష్టిగా పనిచేద్దాం..



కార్యకర్తలతో పార్టీ మండల అధ్యక్షుడు సింహాచలం, జేసీఎస్ కన్వీనర్ చంద్రశేఖర్

భామిని: పార్టీ కార్యకర్తలు అధిష్టానం ఆదేశాలను తూచతప్పక పాటించి సీఎం జగనన్న లక్ష్యాలను సాధించేందుకు సిద్ధంగా ఉండాలని వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు తోట సింహాచలం, జేసీఎస్ మండల కోఆర్డినేటర్ కొత్తకోట చంద్రశేఖర్ పిలుపునిచ్చారు. మండలంలోని పెద్దదిమిలిలో ఆదివారం పార్టీ మండల నాయకులు టింగ అన్నాజీరావు, మజ్జి మోహనబాబు ఆధ్వర్యంలో పార్టీ నాయకులు, కార్యకర్తల సమావేశం నిర్వహించారు. గృహసారథుల నియామకాలపై గ్రామాల వారీగా సమీక్షించారు. గృహసారథుల నియామకం వీలైనంత తొందరగా చేపట్టాలన్నారు. పార్టీ ఆదేశాలకు అనుగుణంగా మనమంతా సమష్టిగా పనిచేద్దామని, మరోసారి పార్టీని అధికారంలోకి తీసుకువచ్చేందుకు కృషిచేద్దామన్నారు. సమావేశంలో సొసైటీ చైర్మన్ జి.రమేష్, పెద్దదిమిలి, బాలేరు, గురండి సర్పంచ్‌లు తొగరాన శ్రీను, జామి ప్రభాకర్, జామి భైరాగి, పార్టీ నాయకులు వై.పాపినాయుడు, ఎం.చలపతిరావు, అర్లి రాజశేఖర్, మజ్జి జగదీష్, కాగితాపల్లి కృష్ణారావు, వలరౌతు రామారావు ఉన్నారు.

రాజుల చిక్కుడుకు గిరాకీ



సీతానగరంలో పందిరిపై రాజుల చిక్కుడు పంట

సీతానగరం: ఇళ్లలో రసాయన రహితంగా పండించే కూరగాయలంటేనే అందులోనూ రాజుల చిక్కుడు పిక్కలంటే బాగా గిరాకీ ఉంది. శీతాకాలం రాగానే మండల కేంద్రంలో ప్రతిఇంటి ముందు, వెనుక ఉన్న ఖాళీస్థలాల్లో కూరగాయలు, ఆకుకూరలు, రాజుల చిక్కు డు పండించడం ఆనవాయితీగా వస్తోంది. వెలమవారి వీధిలో అరుదైన పంటగా గుర్తించిన రాజుల చిక్కుడు పందిరి వేసి పంటను రెండు దశాబ్దాలుగా సాగు చేస్తున్నారు. రాజుల చిక్కుడు పిక్కలు కుంచం(మూడు కేజీలు) రూ. 1500 నుంచి రూ.1800 వరకు విక్రయిస్తున్నారు. చిక్కుడు పిక్క లను పెళ్లిళ్లు, వేలాదిమందితో ఫంక్షన్లు చేసే సమయాల్లో ఇక్కడ ఉండే ప్రజలతో పాటు బొబ్బిలి, పార్వతీపురం, మక్కువ, విశాఖ, విజయనగరం ప్రాంతాలకు చెందిన వారు ఖరీదు చేస్తారు. ఆయాప్రాంతాల్లో ఫంక్షన్లు వచ్చాయంటే రాజుల చిక్కుడు పిక్కలు గుర్తుకు రాక మానవు.

రాష్ట్రంలో సువర్ణపాలన

- మంత్రి పీడిక రాజన్నదొర



ప్రజలకు సంక్షేమ పథకాలను వివరిస్తున్న ఉప ముఖ్యమంత్రి పీడిక రాజన్నదొర

సాలూరు: అర్హతే ప్రామాణికంగా అత్యంత పారదర్శకంగా సంక్షేమ పథకాలు అందిస్తూ సువర్ణ పాలన కొనసాగిస్తున్న ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డిని మరోసారి ఆశీర్వదించాలని ఉప ముఖ్యమంత్రి, గిరిజన సంక్షేమ శాఖా మంత్రి పీడిక రాజన్నదొర కోరారు. మున్సిపాలిటీలో గాంధీనగర్ సచివాలయ పరిధి ఏడో వార్డులో గాంధీనగర్-1, దాసరివీధుల్లో మున్సిపల్ వైస్‌చైర్మన్ వంగపండు అప్పలనాయుడు, కౌన్సిలర్ అప్పలనాయుడు అధ్యక్షతన కమిషనర్ శంకరరావు ఆధ్వర్యంలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక ప్రజలు రాజన్నదొరకు ఘన స్వాగతం పలికారు. అనంతరం మంత్రి, తదితరులు ఇంటింటికీ వెళ్లి వైఎస్సార్‌సీపీ పాలనలో ఒక్కో కుటుంబానికి సంక్షేమ పథకాల ద్వారా ఎంత లబ్ధి చేకూరినదీ వివరించారు. అలాగే సచివాలయ ఉద్యోగులు, వలంటీర్ల పనితీరుపై ఆరా తీశారు. తమ వార్డులో సామాజిక భవన నిర్మాణం, శ్మశానవాటిక అభివృద్ధికి నిధులు, తదితర సమస్యలను స్థానికులు తెలియజేయగా.. వాటిని పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. వివిధ సంక్షేమ పథకాల ద్వారా ముఖ్యమంత్రి అందిస్తున్న నగదును మహిళలు సద్వినియోగం చేసుకుని ఆర్థిక స్వావలంభన సాధించాలని సూచించారు. వైఎస్ జగన్ మోహన్‌రెడ్డిని రానున్న ఎన్నికల్లో మరోసారి ఆశీర్వదించాలని కోరారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ జర్జాపు దీప్తి, కౌన్సిలర్లు, నాయకులు జర్జాపు ఈశ్వరరావు, రాపాక మాధవరావు, వెంకటరమణ, లింగాల దుర్గ, పప్పల లక్ష్మణ, గులిపల్లి నాగ, ఎర్రదాలినాయుడు, పిరిడి రామకృష్ణ, పతివాడ శివ, తదితరులు పాల్గొన్నారు.

అనుమతులెలా మంజూరు చేశారు..

కార్యక్రమంలో భాగంగా జాతీయరహదారి పక్కనున్న అపార్ట్‌మెంట్ వాసులు మంత్రితో మాట్లాడుతూ, అపార్ట్‌మెంట్ నుంచి వాడుకనీరు కాలువల ద్వారా బయటకు వెళ్లడం లేదని, తాగునీటి సౌకర్యం కూడా లేదని తెలిపారు. దీంతో మంత్రి స్పందిస్తూ, నిబంధనలు పాటించని నిర్మాణాలకు అనుమతులెలా మంజూరు చేశారని కమిషనర్‌ను ప్రశ్నించారు. ఇటువంటి అపార్ట్‌మెంట్లు ఎన్ని ఉన్నాయో గుర్తించి తన దృష్టికి తీసుకురావాలని ఆదేశించారు.

- **రోడ్డు విస్తరణ పనుల పరిశీలన**

పార్వతీపురంటౌన్: గడిచిన మూడు దశాబ్దాలుగా ఎదురుచూస్తున్న రోడ్డు విస్తరణ పనులను ప్రారంభించింది వైఎస్సార్‌సీపీ ప్రభుత్వమేనని డిప్యూటీ సీఎం రాజన్నదొర అన్నారు. రూ.17 కోట్ల అంచనా వ్యయంతో ఒడిశా రాష్ట్రం నుంచి పార్వతీపురం మండలం మీదుగా గల అంతరాష్ట్ర రహదారిపై జరుగుతున్న రోడ్డు విస్తరణ పనులను స్థానిక ఎమ్మెల్యే అలజంగి జోగారావుతో కలిసి శనివారం రాత్రి ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రోడ్డు విస్తరణ పనులు దాదాపు 70 శాతం పూర్తి చేసుకోవడంతో పాటు ఎమ్మార్‌నరం, చినబొండపల్లి, వెంకంపేట గ్రామాల ప్రజలు గత 30 ఏళ్ల కాలంగా ఎదురుచూస్తున్న రోడ్డు విస్తరణ, కాలువల నిర్మాణం వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం హయాంలో జరుగుతున్నాయన్నారు. రోడ్డు విస్తర ణ, అభివృద్ధి పనులకు సహకరించిన స్థానిక ఎమ్మె ల్యే జోగారావు, రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పీడిక రాజన్నదొరకు తామంతా రుణపడి ఉంటామని ఆయా గ్రామాల ప్రజలు, ప్రజా ప్రతినిధులు ఈ సందర్భంగా కృతజ్ఞతలు తెలియజేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు బొమ్మి రమేష్, ఎంపీపీ మజ్జి శోభారాణి, వైస్ ఎంపీపీ సిద్ధా జగ న్నాథరావు, మూడు గ్రామాల సర్పంచులు గండి శంకర్రావు, తీళ్ల కృష్ణారావు, వంగపండు త్రినాథ నాయుడు, ఎంపీటీసీ సభ్యులు బంకురు రవికుమా ర్, బడే రామారావుతో పాటు ఇతర గ్రామాల సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రశాంతంగా ఎన్‌ఎంఎంఎస్ పరీక్ష

పాలకొండ రూరల్:

పట్టణంలోని పెద్దకాపువీధి జెడ్పీ బాలికల ఉన్నత పాఠశాల, ప్రభుత్వ ఉన్నత పాఠశాల కేంద్రాల్లో నేషనల్ మీన్స్ కమ్ మెరిట్ స్కాలర్‌షిప్(ఎన్ఎంఎంఎస్) ఎగ్జామ్ ఆదివారం ప్రశాంత వాతావరణంలో నిర్వహించారు. ఇన్‌చార్జ్ డీఈఓ బ్రహ్మాజీ ఆయా కేంద్రాలను సందర్శించి పరీక్షల నిర్వహణను పరిశీలించారు. అనంతరం పెద్దకాపువీధి జెడ్పీ ఉన్నత పాఠశాలలో నాడు–నేడు పనులు పరిశీలించారు. హెచ్ఎం జామి రవి పనుల తాజా స్థితిగతులను ఆయనకు వివరించారు. త్వరితగతిన పనులు పూర్తిచేయాలని ఇన్‌చార్జ్ డీఈఓ సూచించారు.



బాలికల ఉన్నత పాఠశాల పరీక్ష కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఇన్‌చార్జ్ డీఈఓ బ్రహ్మాజీ

మొక్కజొన్నలో యాజమాన్య పద్ధతులు



పెద్దూరు సమీపంలో మొక్కజొన్న సాగు

గరుగుబిల్లి: రబీలో మొక్కజొన్న సాగు రైతులు సరైన యాజమాన్య పద్ధతులు పాటిస్తే అధిక దిగుబడి సాధించవచ్చని వ్యవసాయాధికారి ఆర్.విజయభారతి అన్నారు. సాగులో పాటించాల్సిన యాజమాన్య పద్ధతులు, చీడపీడల నివారణపై ఆదివారం ఆమె అవగాహన కల్పించారు. నీటి వసతి తక్కువగా ఉన్న మెట్టభూముల్లో నవంబరు నెలాఖరు నుంచి జనవరి వరకు విత్తనాలు విత్తుకోవచ్చన్నారు. ఎకరాకు 7 నుంచి 8 కిలోల విత్తనాలు అవసరం. కిలో విత్తనానికి 2 గ్రాముల కార్బండిజమ్‌తో విత్తనశుద్ధి చేసుకోవాలి. వరుసల మధ్య 2 1/2 అడుగులు, మొక్కల మధ్య 8 అంగులాల దూరం ఉండేలా విత్తనాలు విత్తుకోవాలి. విత్తనాలు విత్తే ముందు ఆఖరి దుక్కిలో 50 కిలోల డీఏపీ, 40 కిలోల యూరియా, 35 కిలోల పొటాష్‌ను వేసుకోవాలి.

విత్తిన నెలరోజులకు 35 కిలోల యూరియా, 60 రోజులకు 35 కిలోల యూరియాను మొక్కకు దగ్గరలో వేసుకోవాలి. పంటలో జింకులోపం ఎప్పుడైనా కనిపిస్తే లీటర్ నీటికి 2 గ్రాముల జింక్‌సల్ఫేట్‌ను పిచికారీ చేసుకోవాలన్నారు. సరైన యాజమాన్య పద్ధతులు పాటిస్తే తక్కువ ఖర్చుతో అధిక దిగుబడులు వచ్చే అవకాశం ఉంది. మార్కెట్‌లో మొక్కజొన్నకు మంచి డిమాండ్ ఉంది. పశవుల దాణాగా, కోళ్లమేతగా, పరిశ్రమల్లో ముడిసరుకుగా వినియోగిస్తుంటారు.

విచారణ పేరుతో తీవ్రంగా కొట్టడం సరికాదు

గుమ్మలక్ష్మీపురం: విచారణ పేరుతో గిరిజనుడిని తీవ్రంగా కొట్టి ఆస్పత్రి పాలు చేయడం ఎల్విన్‌పేట పోలీసులకు ఏమాత్రం తగదని గిరిజన జాగృతి రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే కోలక లక్ష్మణమూర్తి అన్నారు. మండలంలోని దుడ్డుఖల్లు గిరిజన సంక్షేమ బాలుర ఆశ్రమ ఉన్నత పాఠశాలలోని జనరేటర్ చోరీకి గురైందంటూ పాఠశాల డిప్యూటీ వార్డెన్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు అదే గ్రామానికి చెందిన కొండగొర్రి కామరాజు అనే గిరిజనుడిని విచారణ పేరుతో ఎల్విన్‌పేట పోలీసులు తీవ్రంగా కొట్టిన సంగతి విధితమే. చికిత్స అనంతరం డిశ్చార్జ్ అయిన కామరాజును లక్ష్మణమూర్తి ఆదివారం దుడ్డుఖల్లు వెళ్లి పరామర్శించారు. కామరాజు, అతని కుటుంబ సభ్యులతో మాట్లాడి జరిగిన సంఘటనపై ఆరా తీశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ నేరం నిర్ధారణ అయితే చట్టపరమైన చర్యలు చేపట్టాలే గాని, నేరం నిర్ధారణ కాకుండా ప్రాథమిక విచారణ పేరుతో తీవ్రంగా కొట్టడం సరికాదన్నారు. ఇటువంటి సంఘటనలు పునరావృతం కాకుండా సంబంధిత ఉన్నతాధికారులు దృష్టి సారించాలని కోరారు. బాధితుడు కామరాజుకు న్యాయం చేయాలని, లేకుంటే గిరిజన జేఏసీతో కలిసి ప్రత్యేక కార్యాచరణ నిర్వహిస్తామని స్పష్టం చేశారు. ఆయనతో పాటు ఆదివాసీ వికాస పరిషత్ జిల్లా అధ్యక్షుడు పువ్వల సత్యనారాయణ, గిరిజన సంఘం నాయకులు గొర్లె తిరుపతిరావు, నిమ్మక గౌరీశంకరరావు, పువ్వల తిరుపతిరావు ఉన్నారు.



కామరాజును పరామర్శిస్తున్న కోలక లక్ష్మణమూర్తి

• విరబూసిన మామిడి

జియ్యమ్మవలస మండలం సుభద్రమ్మవలస వద్ద మామిడి చెట్టు విరగపూసింది. నిన్నమొన్నటి వరకు పొగమంచు ఎక్కువగా ఉండడంతో ఈ ఏడాది మామిడి దిగుబడిపై రైతులు ఆందోళన చెందారు. ప్రస్తుతం మంచు ప్రభావం తగ్గడంతో పాటు పూత చిగురించడంతో మామిడి రైతుల ఆశలు చిగురించాయి.

– జియ్యమ్మవలస



పొదుపు సంఘాలు బలోపేతం కావాలి

సీతానగరం: మండలంలోని పొదుపు సంఘాలు బలోపేతం కావాలని– చిరు వ్యాపారాలపై దృష్టి సారించాలని వెలుగు ఏపీఎం రెడ్డి శ్రీరాములు అన్నారు. ఈ మేరకు మండల వెలుగు సమాఖ్య ఆధ్వర్యంలో ఆదివారం సమీక్షా సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం పొదుపు సంఘాల ఆర్థికాభివృద్ధికి అధిక ప్రాధాన్యం ఇచ్చిందని సభ్యులంతా బ్యాంకుల ద్వారా సమకూర్చుతున్న రుణాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. మండలంలో ఇప్పటి వరకు శ్రీనిధి పథకం ద్వారా తీసుకున్న రుణాలతో 129 మంది సభ్యులు ఆవులు మేకల పెంపకం, 116 మంది కిరాణా, 23 మంది బట్టలషాపులు, 388 మంది పెరటి కోళ్ల పెంపకం, 196 మంది వ్యవసాయ పరికరాలు, 17 మంది చేపల పెంపకం, 65 మంది ఆహార వస్తువుల తయారీ, 666 మంది చేతి వృత్తుల వ్యాపారాలు చేస్తున్నట్లు వివరించారు.

సకాలంలో రుణాలు చెల్లించాలి

వ్యాపారాలు సాగిస్తున్న సభ్యులంతా నిర్దేశించిన గడువులోగా రుణాలు చెల్లించాలని కోరారు. స్వయంసహాయక సంఘాల సభ్యులు వాణిజ్య పరంగా అభివృద్ధి చెందడానికి అవసరమైన రుణాలు సమకూర్చడానికి ప్రభుత్వం అన్నివిధాలుగా సహకరిస్తుందని భరోసా ఇచ్చారు. ఈ క్రమంలో బ్యాంకుల నుంచి లింకేజీ రుణాలు తీసుకున్న వారిలో కొంత మంది సభ్యులు శ్రీ నిధి రుణాలు చెల్లించకపోవడంతో గుచ్చిమిలో సభ్యులకు అవగాహన సదస్సు నిర్వహించినట్లు చెప్పారు. రుణాలు పొంది సక్రమంగా బ్యాంక్‌లకు చెల్లించని వారు వాయిదాలు చెల్లించి సహచర పొదుపు సంఘాల సభ్యులకు బ్యాంకుల నుంచి రుణాలు సమకూర్చే విధంగా చూడాలని అందుకు గ్రామైఖ్య సంఘాల ప్రతినిధులు సభ్యులకు అవగాహన కల్పించాలని సూచించారు.



మాట్లాడుతున్న వెలుగు ఏపీఎం ఆర్.శ్రీరాములు

సంక్షేమ బాంధవుడు జగన్

బలిజిపేట: సీఎం జగన్‌మోహన్ రెడ్డి ప్రజల పాలిట సంక్షేమ బాంధవుడని ఎమ్మెల్యే జోగారావు అన్నారు. బలిజిపేట మండలం అరసాడలో గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలోని ప్రతి ఇంటికి వెళ్లి ప్రభుత్వం ద్వారా వారికి అందిన సంక్షేమ వివరాలతో కూడిన బుక్‌లెట్లను లబ్ధిదారులకు అందజేశారు. అనంతరం కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వంలో అర్హు లు ఉన్న ప్రతి ఇంటికి సంక్షేమ పథకం అందుతోందని, అది కాదని ఎవరైనా అనగలరా? అని ప్రశ్నించారు. జగన్‌మోహన్ రెడ్డి అన్ని వర్గాలవారికి సంక్షే మ పథకాలను అందిస్తున్న గొప్ప వ్యక్తి అని తెలిపా రు. అటువంటి నాయకుడిని అందరం సమర్థించి మళ్లీ సీఎంగా చేయాలని కోరారు. రాష్ట్రంలో అమలవుతున్న సంక్షేమ పథకాలు సక్రమంగా ప్రజలకు అందుతున్నాయో? లేదో? తెలుసుకునేందుకే గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ పోల సుజాత, ఎంపీటీసీ జి.ప్రభావతి, ఎంపీడీఓ భానుమూర్తి, ఎంపీపీ జి. నాగమణి, జెడ్పీటీసీ ఎ.రవికుమార్, మండల ఉపాధ్యక్షుడు వి.సాయిరాం, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు పి.మురళీకృష్ణ, మండల కన్వీనర్ల అధ్యక్షుడు జి.శ్రీరాములునాయుడు, పి.రామకృష్ణ, జి.లక్ష్మణరావు, పాపినాయుడు, జి.రాజు, సర్పంచ్‌లు సుందరరావు, విజయ, ఆర్.శ్రీనివాసరావు, ఎస్.పాపారావు తదితరులు పాల్గొన్నారు.



అరసాడలో లబ్ధిదారుకు బుక్‌లెట్ అందించి వివరాలు తెలుసుకుంటున్న ఎమ్మెల్యే జోగారావు